క్లుప్తంగా

28న వాహనాల వేలం



వేలం నిర్వహించనున్న వాహనాలు

కోడుమూరు రూరల్: కోడుమూరు స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ పరిధిలో అక్రమ మద్యం, నాటుసారా రవాణా చేస్తూ పట్టుబడిన మూడు కార్లు, ఒక అశోక్‌లే లాండ్ వాహనాన్ని ఈ నెల 28వ తేదీ మంగళవారం బహిరంగ వేలం వేస్తున్నట్లు సెబ్ సీఐ శ్యామ్ ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు రూ.10000లు ధరావతు చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని కోరారు. వాహనాలు దక్కించుకోని వారికి ధరావతు మొత్తం తిరిగి ఇస్తామన్నారు. వాహనాలు దక్కించుకున్న వారికి సెబ్ శాఖ నుంచి సర్టిఫికెట్ ఇవ్వడం జరుగుతుందని, ఆ సర్టిఫికెట్‌తో ఆర్టీఓ ఆఫీస్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చునని సీఐ పేర్కొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ

పాణ్యం: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పాణ్యం సీఐ వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం మండల కేంద్రమైన పాణ్యంలోని కేఆర్‌ఆర్ స్కూల్‌లో విద్యార్థులకు సైబర్‌నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ప్రస్తుతం సాంకేతిక విప్లవం విస్తరిస్తున్న నేపథ్యంలో సైబర్ నేరాల సంఖ్య పెరిగిందన్నారు. సైబర్ నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. విద్యార్థులు అవసరమైన మేరకు మాత్రమే సాంకేతి పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ సుధాకర్‌రెడ్డి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సుంకేసులకు ఇన్‌ఫ్లో

గూడూరు: సుంకేసులకు శనివారం 1,120 క్యూసెక్కుల ఇన్ ఫ్లో ఉంది. డ్యాంలో 0.634 టీఎంసీల నీరు నిల్వ ఉండగా కేసీ కాల్వకు 1,058 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

చురుగ్గా అభివృద్ధి పనులు



చనుగొండ్ల హైస్కూల్‌లో నిర్మితమవుతున్న అదనపు గదులు

గూడూరు రూరల్: మండల పరిధిలోని చనుగొండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాడు–నేడు కింద చేపట్టిన అభివృద్ధి పనులు చురుగ్గా జరుగుతున్నాయి. రెండో విడత నాడు–నేడు కింద చనుగొండ్ల హైస్కూల్‌కు రూ.80 లక్షల నిధులు మంజూరు అయ్యాయి. ఆ నిధులతో ఇప్పటికే మూడు అదనపు తరగతి గదుల నిర్మాణాలను 70 శాతానికి పైగా అధికారులు పూర్తి చేశారు. మినరల్ వాటర్ ప్లాంటు, టాయిలెట్లు, పాఠశాల చుట్టు ప్రహరీ నిర్మాణం వంటి పనులు జరగాల్సి ఉంది. వచ్చే విద్యా సంవత్సరం జూన్ నాటికి అన్ని రకాల అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఎంఈఓ సునీలమ్మ తెలిపారు.

దాసరి రంగముని సేవలు చిరస్మరణీయం

కర్నూలు కల్చరల్: జిల్లా రంగస్థల కళారంగంలో సీనియర్ కళాకారుడు దాసరి రంగముని సేవలు చిరస్మరణీయమని కర్నూలు జిల్లా రంగ స్థల కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుర్రపుసాల అంకయ్య అన్నారు. శనివారం మద్దూరునగర్‌లోని పింగళి సూరన తెలుగు తోటలో కందుకూరి విశిష్ట పురస్కారం గ్రహీత దాసరి రంగముని సంస్మరణ సభ జరిగింది. కళాకారులు ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అంకయ్య మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా ఎందరో కళాకారులను తీర్చిదిద్ది కళామతల్లి ముద్దుబిడ్డగా నిలిచారన్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి హనుమంతరాయ చౌదరి, కార్యనిర్వాహక కార్యదర్శి బైలుప్పల షఫీవుల్లా, సభ్యులు సయ్యద్ రోషన్‌అలీ, తిరుపాల్, అజయ్‌కుమార్, మనోహర్‌బాబు, అరుణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు చేరుకున్న బైక్ యాత్ర

కర్నూలు కల్చరల్: శ్రీరామ రాజ్యం హిందుత్వ చైతన్య వేదిక ఆధ్వర్యంలో అంబాబత్తుల అండకొండ రాముడు చేపట్టిన బైక్ యాత్ర శనివారం కర్నూలుకు చేరుకుంది. భజరంగ్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, శ్రీరామ రాజ్యం హిందుత్వ చైతన్య వేదిక నాయకులు రవిరెడ్డి, వీహెచ్‌పీ నగర ఉపాధ్యక్షులు నాగరాజులు ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దశాబ్దాలుగా మరుగున పడిన పుష్పగిరి గిరి ప్రదక్షిణ పునరుద్ధరణ మహా సంకల్ప దీక్షలో భాగంగా రాముడు ప్రచార యాత్ర చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రతాప్ కల్యాణ్, ధరణి, తదితరులు పాల్గొన్నారు.

జోరుగా రియల్ దందా

- పుట్టగొడుగుల్లా అక్రమ లేఅవుట్లు
- పంచాయతీ ఆదాయానికి గండి
- అధికారులు నోటీసులిచ్చినా పట్టించుకోని రియల్ ఎస్టేట్ వ్యాపారులు



కోడుమూరులోని వెంకటగిరి రోడ్డులో వేసిన అక్రమ లేఅవుట్

కోడుమూరు: కోడుమూరు నియోజకవర్గంలో అక్రమ లేఅవుట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రభుత్వ అనుమతులు తీసుకోకుండా ఇష్టానుసారంగా లేఅవుట్లు వేసి లాభాలు గడిస్తూ పంచాయతీ ఆదాయానికి గండి కొడుతున్నారు. వ్యవసాయ భూమిని వ్యవసాయేతర అవసరాలకు వినియోగించాలంటే అందులో 10 శాతం భూమిని పంచాయతీలకు అప్పగించాలి. అంతేగాక అంతర్గత రోడ్లు 33 అడుగులు, అప్రోచ్ రోడ్లు 40 అడుగులు వదిలి పంచాయతీ నుంచి సాంకేతిక అనుమతి తీసుకోవాల్సి ఉంది. అయితే రియల్టర్లు ఈ నిబంధనలను పాటించడం లేదు. కోడుమూరు శివారులోని తహసీల్దార్ కార్యాలయం వెనుక డోన్ పట్టణానికి చెందిన రియల్‌ఎస్టేట్ వ్యాపారులు 50 ఎకరాల్లో లేఅవుట్లు వేశారు. పంచాయతీ అనుమతి లేకుండా ప్లాట్లను విక్రయించారు. ఒక్కో ప్లాట్‌ను ఇద్దరి నుంచి ముగ్గురికి అమ్మిన సంఘటనలు వెలుగులోకి వచ్చాయి. కోడుమూరు, గూడూరు, కర్నూలు, నాగలాపురం ప్రాంతాల్లో అనుమతిలేని లేఅవుట్లు దాదాపు 150 ఉన్నట్లు అధికారులు గుర్తించి నోటీసులిచ్చినా రియల్టర్లు పట్టించుకోవడంలేదు. అక్రమ లేఅవుట్లలో ప్లాట్లు కొన్నవారు భవిష్యత్తులో ఇబ్బందులను ఎదుర్కొనే పరిస్థితులున్నాయి.

అక్రమ లేఅవుట్లు ఇవే :

కోడుమూరు పట్టణ పరిసర ప్రాంతాల్లో 50 అక్రమ లేఅవుట్లు ఉన్నట్లు పంచాయతీ అధికారులు గుర్తించారు. లేఅవుట్ల యజమానులకు గతంలో పంచాయతీ అధికారులు నోటీసులు జారీ చేశారు. దాదాపు రూ.15 లక్షలు పంచాయతీకి పన్నులు చెల్లించాలని నోటీసు ఇచ్చినా ఇంతవరకు ఒక్క పైసా వసూలు కాలేదు. గత ఏడేళ్ల కాలంలో కోడుమూరు పట్టణ పరిసర ప్రాంతాల్లో 278 ఎకరాల్లో వెంచర్లు వెలిసాయి. కేవలం 62 ఎకరాలకు మాత్రమే ల్యాండ్ కన్వర్షన్ చేయించారు. మిగతా భూమంతా అక్రమంగానే రియల్టర్లు అమ్ముకున్నట్లు సమాచారం. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వెనుక ఎల్లెల్సీ కాలువను పూడ్చి వేసి ప్లాట్లుగా వేసి వ్యాపారులు అమ్ముకున్నా రెవెన్యూ, ఎల్లెల్సీ అధికారులు పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. అదే విధంగా బి.తాండ్రపాడులో 98 అక్రమ లేఅవుట్ల, పసుపుల, నందనపల్లి, దిన్నెదేవరపాడు, మునుగలపాడు, పంచలింగాల గ్రామాల్లో దాదాపు 1000 ఎకరాల్లో అక్రమంగా వెంచర్లు వేశారు. గూడూరులో ఎమ్మిగనూరుకు చెందిన ఒక రియల్టర్ నెలవారీ కంతుల పద్ధతిలో ప్రజల నుంచి డబ్బులు కట్టించుకొని వారికి ప్లాట్లు రిజిష్టర్లు చేయకుండా పరారయ్యాడు. కర్నూలు రోడ్డులోని జూనియర్ కాలేజ్ దగ్గర దాదాపు 40 ఎకరాల్లో అక్రమంగా వేసిన వెంచర్లను మున్సిపాలిటీ అధికారులు గుర్తించి ప్లాట్ల రాళ్లను తొలగించారు. అయితే అధికారులు అక్రమ లేఅవుట్లు గుర్తించి నోటీసులు ఇచ్చినా రాజకీయ నేతల అండదండలతో రియల్టర్లు తమ వ్యాపారాన్ని జోరుగా సాగిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు.

నోటీసులిచ్చాం

గూడూరు నగర పంచాయతీ పరిధిలో రెండు అక్రమ లేఅవుట్లను గుర్తించాం. రాళ్ల తొలగించి ప్రభుత్వానికి అపరాధ రుసుము చెల్లించాలని నోటీసులిచ్చాం. ప్రభుత్వ అనుమతి లేకుండా లేఅవుట్లు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. కూడా అనుమతి లేకుండా వేసిన వెంచర్లలో ప్లాట్లను కొనుగోలు చేస్తే ఇంటి నిర్మాణానికి అనుమతులు ఇవ్వం. –శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్, గూడూరు

28 నుంచి యాగంటీశ్వర స్వామి తిరుణాల

ఓర్వకల్లు: మండలంలోని ఎన్ కొంతలపాడు గ్రామంలో వెలసిన అంబాసహిత యాగంటీశ్వరస్వామి తిరుణాల ఈ నెల 28వ తేదీ నుంచి ప్రారంభమవుతున్నట్లు ఆలయ ఈఓ మద్దిలేటి తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే తిరుణాల ఉత్సవాల్లో మొదటి రోజు స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకంతో, ధూపదీప నైవేద్యాలు సమర్పించనున్నట్లు చెప్పారు. అలాగే మార్చి 1వ తేదీ సాధారణ పూజకార్యక్రమాలు, అంబటి చంద్రమౌళి, అంబటి అమర్‌నాథ్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహిస్తామన్నారు. రాత్రి 9 గంటలకు హైదరాబాద్ జానపద కళా స్రవంతి వారిచే సినీ సంగీత విభావరి ఉంటుందన్నారు. 2వ తేదీ తెల్లవారు జామున 4 గంటలకు స్వాముల వారి రథోత్సవం, సాయంత్రం పారువేట, తర్వాత నందికోల సేవ, పల్లకీ సేవతో ఉత్సవాలు ముగుస్తాయని పేర్కొన్నారు.

69149.85 ఎకరాల్లో రీసర్వే పూర్తి

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలంలోని 21 రెవెన్యూ గ్రామాల్లో శనివారం నాటికి 69149.85 ఎకరాల్లో భూముల రీ సర్వే పూర్తయిందని కర్నూలు రూరల్ ఇన్‌చార్జ్ తహసీల్దార్ శివరాముడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు భూముల రీ సర్వే చేసి రైతులకు భూ హక్కు పత్రాలను పంపిణీ చేసేందుకు ఆధునిక డిజిటల్ రికార్డులను సిద్ధం చేస్తున్నామన్నారు.

ఇంటి వద్దకే వైద్య సేవలు



చిందుకూరులో మంచానికే పరిమితమైన వృద్ధున్ని పరిశీలిస్తున్న వైద్యాధికారిణి మొల్లా జబీన్

గడివేముల: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ ద్వారా ప్రజలకు ఇంటి వద్దకే వైద్యసేవలు అందుతున్నాయని వైద్యాధికారిణి మొల్లా జబీన్ తెలిపారు. శనివారం మండల పరిధిలోని చిందుకూరు సచివాలయ పరిధిలోని ప్రజలకు, స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలకు వైద్య పరీక్షలు చేసి మందులను అందించారు. అనంతరం గ్రామంలో మంచానికే పరిమితమైన రోగుల ఇంటి వద్దకే వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి పలు సూచనలు, సలహాలు ఇవ్వడంతోపాటు మందులను పంపిణీ చేశారు. ప్రతి గ్రామంలో నెలకు రెండురోజుల పాటు ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఓవర్‌హెడ్ ట్యాంకు



పిల్లర్‌కు కడ్డీలు బయటపడిన దృశ్యం



కూలడానికి సిద్ధంగా తాగునీటి ట్యాంక్

గడివేముల: మండల కేంద్రం గడివేములలోని బొల్లవరం రస్తాలో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. గడివేముల ప్రజల కోసం 60 వేల లీటర్ల సామర్థ్యంతో దాదాపు నాలుగు దశాబ్దాల క్రితం దీనిని నిర్మించారు. సాధారణంగా ట్యాంకు నిర్మించిన 20 ఏళ్ల వరకు మాత్రమే వాడాలి. అయితే ఈ ట్యాంకు నిర్మించి 40 ఏళ్లు గడుస్తున్నా నేటికి దాని ద్వారా నీటిని వదులుతూనే ఉన్నారు. ట్యాంకు నాలుగు పిల్లర్లు కడ్డీలు తేలడంతోపాటు పైభాగమంతా పెచ్చులూడి కూలేందుకు సిద్ధంగా ఉంది. ట్యాంకు పైకి ఎక్కి శుభ్రం చేయాలంటే చాలా భయంగా ఉందని సిబ్బంది వాపోతున్నారు. కావున దానిని పడగొట్టి కొత్త ట్యాంకును నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఎదురూరుకు దేవుళ్లు రావడం శుభపరిణామం



దేవాలయాల నిర్మాణానికి రూ.5 లక్షల నగదును అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

- ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్
- ఆలయాల నిర్మాణానికి రూ.5 లక్షల విరాళం అందజేత

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలంలోని ఎదురూరు గ్రామానికి ఎట్టకేలకు దేవుళ్ల రావడం శుభపరిణామమని కోడుమూరు శాసన సభ్యులు డాక్టర్ జరదొడ్డి సుధాకర్ హర్షం వ్యక్తం చేశారు. శనివారం సాయంత్రం ఎదురూరు గ్రామంలో నిర్మాణంలో ఉన్న శ్రీసీతారాములు, శివాలయాలను ఎమ్మెల్యే పరిశీలించారు. దేవాలయాల నిర్మాణానికి తనవంతుగా రూ.5 లక్షల నగదును గ్రామ ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎదురూరు గ్రామం ఏర్పడినప్పటి నుంచి ఇక్కడ ఎలాంటి దేవాలయం లేదని, దేవుళ్ల విగ్రహాలు కూడా ప్రతిష్టించే సాహసం చేయలేని పరిస్థితి గతంలో ఉండేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో శ్రీసీతారాములు, శివాలయాల నిర్మాణం త్వరగా పూర్తి చేస్తామన్నారు. గతంలోలాగా పండుగల సమయంలో హిందువులు వారి ఇళ్లలో కాకుండా ఆలయాల్లో పూజలు చేసుకునేలా సేందుకు తనవంతు కృషి చేస్తానని అన్నారు. గ్రామంలో ఒకేసారి సీతారాములు ఆలయం, శివాలయం నిర్మాణం జరుగుతుండటంతో ప్రజలు తమ చిరకాల కోరిక త్వరలో తీరనుందని ఎంతో సంతోషంగా ఉన్నారన్నారన్నారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు రవిశాస్త్రి, గ్రామ ప్రజలు సామేల్, వెంకటేష్, పెద్దమద్దిలేటి, వెంకటస్వామి, చిన్న నారాయణ, గురుదాస్, దామోదర్, నాగార్జున, అబ్రహం, జీతన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు, పిల్లలకు టీకాలు వేయాలి



వ్యాధి నిరోధక టీకాల నమోదును ట్యాబ్‌లో పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ రామగిడ్డయ్య

కర్నూలు (న్యూటౌన్): గర్భిణులు, 5 సంవత్సరాల్లోపు పిల్లలకు ఇవ్వాల్సిన టీకాలు, ఐరన్ సిరప్‌లు క్రమం తప్పకుండా ఇవ్వాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.రామగిడ్డయ్య ఏఎన్‌ఎంలను ఆదేశించారు. శనివారం కర్నూలు మండలం ఈ తాండ్రపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు అంగన్‌వాడీ–2 కేంద్రాన్ని, పంచలింగాల అంగన్‌వాడీ కేంద్రంలో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల స్పెషల్ డ్రైవ్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంఅండ్‌హెచ్‌ఓ మాట్లాడుతూ గర్భిణులకు, చిన్నపిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు, ఐరన్ సిరప్‌లు వేసిన తర్వాత అదే రోజు ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఏఎన్‌ఎంలు ట్యాబ్‌లలో శిశు సంరక్షణ సేవలు, గర్భిణీ, కిశోర బాలికల హిమోగ్లోబిన్ పరీక్షలు, ఎన్‌సీడీ సర్వే వివరాలను ఆయన పరిశీలించారు. అనంతరం ఈ తాండ్రపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని కాన్పుల, ఫార్మసీ గదిని పరిశీలించారు. కార్యక్రమంలో ఈ తాండ్రపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సయ్యద్ ముక్తార్‌బాషా, డాక్టర్ విజయ మాధురి, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి

- గృహసారథులు, కన్వీనర్ల సమావేశంలో ఎమ్మెల్యే కాటసాని, మేయర్ రామయ్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని, చిత్రంలో మేయర్ బీవై రామయ్య

కల్లూరు: రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా గృహసారథులు పని చేయాలని పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు, నగర మేయర్ బీవై రామయ్య పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం కల్లూరు అర్బన్ రావూరి గార్డెన్‌లో 19, 20, 21, 26 నుంచి 31వ వార్డుల గృహసారథుల, కన్వీనర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలు, కులాలు, మతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రతి గడపకు వెళ్లి ప్రజలకు వివరించాల్సిన బాధ్యత కన్వీనర్లు, గృహసారథులపై ఉందన్నారు. గత టీడీపీ పాలనలో ఆ పార్టీకి చెందిన వారికి, జన్మభూమి కమిటీ సిఫారసులు ఉన్న వారికే మాత్రమే ప్రభుత్వ పథకాలు అందేవన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పరిస్థితి మారిందని, అర్హత ఉంటే చాలు ఎవరి సిఫారసులు లేకుండానే పథకాలు అందుతున్నాయన్నారు. ప్రతిపక్ష నాయకులు నిత్యం ప్రజలకు అబద్ధాలు, అసత్యాలు చెబుతుండటంతోపాటు ఎల్లో మీడియా కూడా అసత్య ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. ఇదంతా రాష్ట్రంలోని ప్రజలందరూ గమనిస్తున్నారన్నారు. గత టీడీపీ పాలనలో కంటే 43 శాతం అదనంగా పింఛన్లు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. మల్లికార్జున రిజర్వాయర్‌తో కల్లూరు అర్బన్ తాగునీటి సమస్య పరిష్కారంతో పాటు ఐదు నియోజకవర్గాలకు సాగు, తాగునీరు అందుతుందన్నారు. శాసన మండలి 18 స్థానాల్లో 11 స్థానాలు వెనకబడిన వర్గాలకు కేటాయించి వారి అభ్యున్నతి ధ్యేయంగా సీఎం పనిచేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు, నంద్యాల జెడ్పీటీసీ గోకుల్ కృష్ణారెడ్డి, డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, కార్పొరేటర్లు వైజా అరుణ, మిద్దె చిట్టెమ్మ, దండు లక్ష్మీకాంతరెడ్డి, నారాయణరెడ్డి, కాశపోగు జయరాముడు, లక్ష్మీరెడ్డి, కల్లూరు సింగిల్‌విండో చైర్మన్ శివశంకర్‌రెడ్డి, అర్బన్ పరిధిలోని వార్డుల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

2న వేలం పాటలు

గడివేముల: మండల కేంద్రమైన గడివేములలో వెలసిన మూలపెద్దమ్మ అమ్మవారి జాతర సందర్భంగా తలనీలాల ప్రోగు చేసుకునేందుకు మార్చి 2వ తేదీన బహిరంగ వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ మోహన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వారు రూ.10 వేలు డిపాజిట్ చేయాలన్నారు. జాతరను పురస్కరించుకొని వచ్చే నెల 28 నుంచి ఏప్రిల్ 24వ తేదీ వరకు మాత్రమే తలనీలాలు ప్రోగు చేసుకోవచ్చన్నారు. అదే రోజు అమ్మవారి హుండీ లెక్కింపు ఉంటుందన్నారు.

ఎన్ కొంతలపాడులో కబడ్డీ పోటీలు

ఓర్వకల్లు: మండలంలోని ఎన్ కొంతలపాడు గ్రామంలో ఈ నెల 28న అంబాసహిత యాగంటీశ్వర స్వామి తిరుణాల సందర్భంగా అంతర్ రాష్ట్ర పురుషుల కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు తెలిపారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన జట్లకు మొదటి ఐదు స్థానాలకు వరుసగా రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేల చొప్పున నగదు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు అదే రోజు ఉదయం 8 గంటలలోగా రూ.300లు ప్రవేశ రుసుం చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 95021 77501, 98492 90398 నంబర్లలో సంప్రదించాలని వారు సూచించారు.

సెలవుల్లో కమిషనర్

కర్నూలు (టౌన్): నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ రెండు రోజుల పాటు సెలవుల్లో ఉంటారు. వ్యక్తిగత పనులకు సంబంధించి తిరుపతి వెళుతున్నందున అందుబాటులో ఉండరని నగరపాలక కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. ఇన్‌చార్జ్ కమిషనర్‌గా డిప్యూటీ కమిషనర్ ఎస్‌వి.రమాదేవి వ్యవహరిస్తారని పేర్కొన్నారు.

పారిశుద్ధ్యం, అభివృద్ధి పనులకు ప్రాధాన్యత

కర్నూలు (టౌన్): నగరంలో పారిశుద్ధ్యం, అభివృద్ధి పనులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ అన్నారు. శనివారం స్థానిక నగరపాలక సంస్థ పరిధిలోని 10వ వార్డులో ఆయన పర్యటించారు. ఆ వార్డు కార్పొరేటర్ షేక్ యూనుస్‌బాషాతో కలిసి పారిశుద్ధ్యం సమస్యలు, వార్డులో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను పరిశీలించారు. గుమ్మజ్ ప్రాంతం, బావర్చీవాడ, కేవీఆర్ గార్డెన్, కల్యాణ్ జ్యువెలర్స్ ప్రాంతాలలో పర్యటించారు. కార్పొరేటర్ సూచన మేరకు వార్డులో నెలకొన్న మెయిన్ డ్రైయిన్ సమస్య పరిష్కారంతో పాటు గుమ్మజ్‌లో పార్కును ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ఎస్‌వి.పద్మావతి, డీఈఈ గోపాలకృష్ణయ్య, ఏఈ రాఘవయ్య పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు పరిష్కరించాలి



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శారద

కల్లూరు: మండలంలోని అధికారులందరూ ప్రజలు, రైతుల సమస్యలను సకాలంలో పరిష్కరించాలని మండల పరిషత్ అధ్యక్షురాలు(ఎంపీపీ) బోయ శారద అన్నారు. శనివారం కల్లూరు మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ అధ్యక్షతన మండల పరిషత్ సమావేశ భవనంలో జరిగింది. ఈ సమావేశానికి జెడ్పీటీసీ ఆల ప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఇతర ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ... అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలు అందించాలని అధికారులకు సూచించారు. వేసవి కాలంలో గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. మండల స్థాయి అధికారులు తమ శాఖల వారీగా ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పలువురు ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షులు–2 చంద్రశేఖర్‌రెడ్డి, అడ్మినిస్ట్రేషన్ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కల్లావెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.


వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి



మాట్లాడుతున్న డాక్టర్ వేణుగోపాల్

కోడుమూరు రూరల్: ఈ ఏడాది ఏప్రిల్‌లో జరుగనున్న పదవ తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ డాక్టర్ వేణుగోపాల్ పేర్కొన్నారు. వర్కూరులోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులతో ఆయన మాట్లాడారు. పదవ తరగతి పరీక్షల్లో ఫిజికల్ సైన్స్, మ్యాథమెటిక్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులు కీలకమని, వాటిపై ఎక్కువగా దృష్టి సారించాలని సూచించారు. కష్టతరమైన సబ్జెక్టులపై విద్యార్థినులు పూర్తి స్థాయిలో పట్టు సాధిస్తే మంచి ఫలితాలను పొందే అవకాశం ఉంటుందన్నారు. రానున్న రెండు నెలలు విద్యార్థినులు చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో అలెస్కో శ్రీనివాసులు, సీఎంఓ కమ్యూనిటీ మొబైల్ ఆఫీసర్ సునీత, ప్రిన్సిపాల్ గౌసియా బేగం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


జొన్న కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోండి



రైతులతో మాట్లాడుతున్న అధికారులు

సి.బెళగల్: మండలంలో జొన్న సాగు చేసుకున్న రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శివశంకర్ నాయక్ అన్నారు. శనివారం మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ మండలంలోని కంబదహాల్ గ్రామంలో జొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటుపై స్థానిక ఆర్బీకేలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రభుత్వం క్వింటం జొన్నలు రూ.2970లతో కొనుగోలు చేస్తుందని, విక్రయించే రైతులు ఆయా గ్రామాల వీఆర్వోలను సంప్రదించి తమ వివరాలను నమోదు చేయించుకోవాలని అన్నారు. ఏఓ మాట్లాడుతూ.. గ్రామ వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు కొనుగోలు కేంద్రాలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శి అభిషేకం, ఎంపీఈఓ వెంకటేశ్వర్లు, వ్యవసాయ సహాయకులు శశిదేవి, గ్రామ వలంటీర్లు ఉన్నారు.

గని లీజులకు అనుమతులు ఇవ్వొద్దు



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): కేతవరం సిలికా సాండ్ గని లీజులకు అనుమతులు ఇవ్వరాదని కాలుష్య నియంత్రణ మండలి ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో కేతవరం, కన్నమడకల గ్రామస్తులు శనివారం ఆందోళన నిర్వహించారు. సీపీఎం నాయకుడు జి.రామకృష్ణ మాట్లాడుతూ..ఆదిమానవులు సంచరించిన ప్రాంతాన్ని కొల్లగొట్టేందుకు చూడడం బాధకరమన్నారు.అలాగే అక్కడ పేదలు సాగుచేసుకుంటున్న భూములను స్వాధీనం చేసుకొని లీజు పేరుతో పెద్దలకు అప్పజెప్పేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయన్నారు. కాలుష్య నియంత్రణ అధికారులు స్పందించి ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకోవాలన్నారు.